సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

క్లినికల్ రీసెర్చ్‌పై సదస్సు

కొమ్మాది: ఫార్మసీ విద్యను అభ్యసిస్తున్న వారికి క్లినికల్ రీసెర్చ్‌లో గల ఉపాధి అవకాశాలపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. పుణేకు చెందిన క్లీనోవో రీసెర్చ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ డా.ఐ. రాధిక పాల్గొని ప్రసంగించారు. ఔషధ రంగంలో క్లినికల్ రీసెర్చ్‌కు ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా ఫార్మసీ విద్యార్థులు నిరంతర అభ్యాసకులుగా కొత్త విషయాలు నేర్చుకుంటూ ఎదగాలన్నారు.

రవీంద్రభారతి స్కూల్ బస్సు సిబ్బంది నిరసన

తగరపువలస: యాజమాన్యం సకాలంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీలోని రవీంద్రభారతి స్కూల్ బస్సు సిబ్బంది సోమవారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశారు. తమ జీతాల సంగతి తేల్చాల్సిందేనంటూ డ్రైవర్లు, క్లీనర్లు బస్సులను తీయడానికి ఒప్పుకోలేదు. తమ చిన్నారులు ఇంటికి రాకపోవడంతో ఏం జరిగిందో తెలియని తల్లిదండ్రులు చెందారు. ఎట్టకేలకు సుమారు గంటన్నర నుంచి రెండు గంటల ఆలస్యంగా విద్యార్థులు ఇంటికి చేరుకున్నారు. దీంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

పేదలకు చీరల పంపిణీ



మహిళకు చీర అందజేస్తున్న ధర్మకర్తల మండలి సభ్యులు

మధురవాడ: మధురవాడ జీవీఎంసీ ఆఫీసు సమీపంలో ఉన్న అచ్చియ్యమ్మ పేరంటాలు గుడి ధర్మకర్తల మండలి సభ్యులు సోమవారం 200 మంది పేదలకు చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. ప్రముఖ వ్యాపార వేత్త అల్లాడ అప్పారావు 26వ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళుల ర్పించి, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వృద్ధాశ్రమాల్లో పండ్లు, రొట్టెలు పంచారు. ధర్మకర్తల మండలి సభ్యులు అల్లాడ ఉమామహేశ్వరరావు, వెంకటరావు, సూర్యారావు, లింగేశ్వరరావు, నక్కాన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటర్ల జాబితా సవరణ



మాట్లాడుతున్న ఆర్డీవో సంగీత్ మాథూర్

పద్మనాభం: త్వరలో చేపట్టనున్న ఓటర్ల జాబితా సవరణను పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీవో సంగీత్ మాథూర్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బీఎల్‌వోలకు ఓటర్ల జాబితా సవరణపై నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఓటర్ల తొలగింపులు, చేర్పులను క్షేత్ర స్థాయిలో ఎంక్వైరీ చేసి చేపట్టాలన్నారు. తహసీల్దార్ కె.ఆనందరావు, డీటీ చంద్రశేఖర్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయినికి సత్కారం



ఉపాధ్యాయిని శ్రావణిని సన్మానిస్తున్న కురపల్లి గ్రామస్తులు

పద్మనాభం: మండలంలోని కురపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా పని చేసి, బదిలీపై వెళ్లి పిన్నింటి శ్రావణిని గ్రామస్తులు పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఆమెను దుశ్శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. ఉపాధ్యాయులు బ్యూలా, శశికళ, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కిక్‌బాక్సింగ్‌లో సతీష్‌కు గోల్డ్ మెడల్



గోల్డ్ విన్నర్ టైటిల్‌తో సతీష్‌కుమార్

తగరపువలస: కిక్ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 6 వరకు న్యూఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో సంగివలసకు చెందిన ఎం.వెంకట పవన్ సతీష్‌కుమార్ గోల్డ్‌మెడల్ సాధించారు. 46–49 కిలోల విభాగంలో సతీష్ ఈ టైటిల్ గెలుచుకున్నాడు. ఇతనికి ఇది 5వ టైటిల్ కావడం విశేషం. వెంకోజీపాలెం మెడికవర్ ఆస్పత్రి రేడియాలజీ విభాగంలో విధులు నిర్వర్తించే సతీష్‌కుమార్‌ను ఆస్పత్రి యాజమాన్యం, సహోద్యోగులు అభినందించారు.

సారూ.. షూ ఏదీ?



కాళ్లకు ఎలాంటి రక్షణ లేకుండా విద్యార్థినులు



చిరిగిన బూట్లతో విద్యార్థులు



బూట్లు సరఫరా చేయని కారణంగా బోసి కాళ్లు, చెప్పులతో విద్యార్థులు

బోసికాళ్లు, చెప్పలతోనే రాకపోకలు ▪ బడి తెరిచి నెలరోజులైనా అందని బూట్లు, సాక్సులు

చిరిగిన షూతో మరికొందరి అవస్థలు ▪ విద్యార్థుల పాదాలకు రక్షణ కరువు

తగరపువలస: పాఠశాలలు పునః ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా విద్యార్థులకు ఇంకా బూట్లు అందలేదు. విద్యార్థి మిత్ర కిట్లలో ఉండవలసిన బూట్లు, రెండు జతల సాక్సులు లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు బోసి కాళ్లు, చిరిగిన బూట్లు, చెప్పులతోనే రాకపోకలు సాగిస్తున్నారు.

దాటవేతలే..

పాఠశాలలకు పూర్తి స్థాయిలో బూట్లు, సాక్సులు చేరకపోవడం, చేరిన వాటిలో ఒకే కాలికి చెందిన జతలు ఉండడం, సైజులలో తేడాలు కారణంగా మండల కేంద్రాలలోని స్టాక్ పాయింట్లను దాటి బూట్లు, సాక్సులు పాఠశాలలను చేరలేదు. దీంతో



భీమిలి స్టాక్ పాయింట్‌లో పంపిణీ కాని అరకొర బూట్లు

స్టాక్ పాయింట్ల నుంచి బూట్లు వెనక్కు పంపాలని ఎంఈవోలు ఆలోచిస్తున్నారు. ఈ సమస్యను పాఠశాలల యాజమాన్యాలు ఎంఈవోలకు చేరవేయడం లేదు. ఎవరు అడిగినా వచ్చాయని, ఇంకా పంపిణీ చేయవలసి ఉందని దాట వేస్తున్నారు. విద్యార్థులు మాత్రం నెల రోజుల పాటు ఎండలలో నడవలేక, బురదలలో అడుగు వేయలేక ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. పాక్షికంగా విద్యార్థులు ప్రత్యామ్నాయంగా చెప్పులు కొనుక్కోగా మిగిలిన విద్యార్థులు చిరిగిన బూట్లతోనే పాఠశాలలకు వస్తున్నారు. విద్యార్థుల ఈ దుస్థితిని చూసి ఉపాధ్యాయులు లోలోపల మథన పడుతున్నా బయట పెట్టలేకపోతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో మొదటి రోజే పంపిణీ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలలు పునః ప్రారంభించిన రోజే విద్యార్థులకు బ్యాగులతో పాటు పుస్తకాలు, యూనిఫారాలు, బూట్లు, డైరీలు ఇచ్చినట్టు విద్యార్థులు, తల్లిదండ్రులు గుర్తు చేసుకుంటున్నారు. 2019 నుంచి 2024 వరకు అయిదేళ్ల పాటు భీమిలి నియోజకవర్గంలో 44,617 మందికి రూ.32.12 కోట్ల విలువైన జగనన్న విద్యా కానుకలు పంపిణీ చేశారు. ఇందులో బూట్లు, సాక్సులు కూడా ఉన్నాయి.

మండలాల వారీగా పంపిణీ కావలసిన బూట్లు

మండలం	మొత్తం విద్యార్థులు	సరఫరా అయిన బూట్లు
భీమిలి	8014	1250
ఆనందపురం	4261	2200
పద్మనాభం	3009	1500
మధురవాడ	9267	2991
మొత్తం	24,551	7941

ఇబ్బందిగా ఉంది



కొత్త యూనిఫాం వేసుకుని బూట్లు లేకుండా గ్రామంలో నుంచి రావాలంటే ఇబ్బందిగా ఉంది. స్కూల్ తెరిచిన నెల రోజులైపోయింది. ఇంకా ఇప్పటికీ ఇవ్వలేదు.

– రీసు భాస్కర్, 10వ తరగతి

వర్షం వస్తే మరింత కష్టం



షూ లేకుండా స్కూల్‌కి రావడం కష్టంగా ఉంది. పాదాలకు ఏమైనా గుచ్చుకున్నా, తగిలినా ఇబ్బంది. ఎండ వస్తుంటే కాళ్లు కాలిపోతున్నాయి. వర్షం వస్తే రోడ్లన్నీ బురదగా ఉంటున్నాయి. ఆ మట్టి కాళ్లతో ఎలా తరగతి గదుల్లోకి వెళ్లగలం? మా బాధలు పట్టించుకోవాలి. మాకు త్వరగా బూట్లు, సాక్సులు అందించాలి.

– గెద్దం నరేంద్ర, 10వ తరగతి

మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో తలవంపులేనా..!

ఈ నెల 10న ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ప్రముఖులు, తల్లిదండ్రులకు ఆహ్వానాలు పంపిస్తోంది. ఈ సమావేశంలో విద్యార్థులే ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. కానీ యూనిఫాం వేసుకుని బూట్లు, సాక్సులు లేకుండా ఇక విద్యార్థులకు మర్యాద ఏముంటదని తల్లిదండ్రులు వాపోతున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలను తలదన్నేలా పాఠశాలలు, విద్యార్థుల రూపురేఖలు మార్చితే కూటమి ప్రభుత్వం రెండు నెలల వేసవి సెలవులు, తరువాత ఒకనెల సమయంలో బూట్లు సమకూర్చలేకపోయిందని అంటున్నారు. గత విద్యాసంవత్సరంలో కూడా గత ప్రభుత్వం సిద్ధంగా ఉంచిన జగనన్న విద్యా కానుకలనే కూటమి ప్రభుత్వం పంపిణీ చేసింది తప్ప వారి గొప్పతనం ఏమీలేదని అంటున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మేల్కొని బూట్లు, సాక్సులతో పాటు అరకొరగా పంపిణీ అయిన పాఠ్యపుస్తకాలు అందించాలని కోరుతున్నారు.

జోన్–2 పీజీఆర్‌ఎస్‌కు 26 దరఖాస్తులు

మధురవాడ: మధురవాడ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు 26 అర్జీలు వచ్చాయి. జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 2, ఈఈ వర్క్స్ కు – 9, వాటర్ సప్లై –6, రెవెన్యూ–1, పబ్లిక్ హెల్త్–01, ఎల్రక్టికల్–3, యూజీడీ, యూసీడీ, సూపరింటెండెంట్, హార్టికల్చర్ విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున అర్జీలు అందాయని జెడ్సీ తెలిపారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

జోన్–1లో ఆరు అర్జీలు

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద జెడ్సీ అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్)కు ఆరు వినతులు వచ్చాయి. ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి మూడు, యూసీడీకి రెండు, పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఒక వినతి వచ్చింది. వీటిని పరిశీలించి, త్వరలో పరిష్కరిస్తానని జెడ్సీ తెలిపారు.



బీ2 కాలనీలో తాగునీటి సమస్యపై వినతి ఇస్తున్న అప్పారావు తదితరులు

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

దాబాగార్డెన్స్: జీవీఎంసీకి జీవీఎంసీ తాగునీటిని సరఫరా చేసే గోస్తనీ హెడ్ వాటర్ వర్క్స్ నుంచి తాగునీటిని పంపింగ్ చేసే ప్రధాన పైప్‌లైన్ మారికవలస గ్రామం వద్ద లీక్ అవుతోంది. పైప్‌లైన్‌కు మంగళవారం మరమ్మతులు చేస్తున్నందున పలు ప్రాంతాల్లో సోమవారం తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ సుధాకర్ ప్రకటనలో తెలిపారు.

జోన్–2 పరిధిలో ప్రాంతాలు

జోన్–2 పరిధి 5వ వార్డు బోయపాలెం, హౌసింగ్ కాలనీ, పరదేశిపాలెం, బోరవానిపాలెం, సాయిరాం కాలనీ, మారికవలస ఆర్‌జీకే, వైఎస్సార్ కాలనీ, శారదానగర్, శివశక్తినగర్, కొమ్మాది

- 6వ వార్డు కొమ్మాది విలేజ్, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం, రిక్షా కాలనీ, వైభవ్‌నగర్, పీఎం పాలెం కే–1, కే–2, కే–3, ఎం–1, హౌసింగ్ కాలనీ
- 7వ వార్డు వాంబే కాలనీ, చంద్రంపాలెం, కళానగర్, కృష్ణానగర్, ఎన్‌జీవోస్ కాలనీ, స్వతంత్రనగర్, గణేష్‌నగర్, మిథిలాపురి ఉడా కాలనీ, ఓల్డ్ మధురవాడ, పిలకవానిపాలెం
- 8వ వార్డు రెవెన్యూ లేఅవుట్, షిప్‌యార్డ్‌కాలనీ, బింద్రానగర్ తదితర ప్రాంతాలకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామన్నారు.

టీబీ, లెప్రసీపై అప్రమత్తత అవసరం

మధురవాడ: ప్రజలు టీబీ, లెప్రసీ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా క్షయ మరియు లెప్రసీ నివారణాధికారి డాక్టర్ ఆర్. రమేష్ సూచించారు. మధురవాడ పీహెచ్‌సీని సోమవారం సందర్శించిన ఆయన టీబీ, లెప్రసీ నివారణ, అవగాహన కార్యక్రమాలగురించి పీహెచ్‌సీ వైద్యాధికారి దీపికను అడిగి తెలుసుకున్నారు. కొమ్మాదిలో టీబీ ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా నిర్వహించిన హెల్త్ క్యాంపును సందర్శించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంప్‌లో 50 శాంపిల్స్ సేకరించారు. ల్యాబ్ సూపర్‌వైజర్ వీరబ్రహ్మం, సురేష్, అనూష, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మధురవాడ పీహెచ్‌సీలో టీబీ, లెప్రసీ కార్యక్రమాలపై ఆరా తీస్తున్న డాక్టర్ రమేష్

అలముకున్న విషాదం

- అమెరికాలో భీమిలి యువతి దుర్మరణం
- శోకసంద్రంలో బంధుగణం



శివాన్విత (ఫైల్)

భీమునిపట్నం: భీమిలి నియోజకవర్గ బీజేపీ కో–ఆర్డినేటర్ కంటుభుక్త రామానాయుడు రెండో కుమార్తె శివాన్విత(18) మూడు రోజుల క్రితం అమెరికాలో జరిగిన రోడ్డుప్రమాదంలో మరణించడంతో భీమిలిలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఈమె శాండియాగో యూనివర్సిటీలో బీఏ సైకాలజీ రెండో సంవత్సరం చదువుతూ, పార్ట్ టైం జాబ్ చేస్తోంది. కాలిఫోర్నియాలో అక్క, స్నేహితులతో కలిసి నివసిస్తోంది. గత శనివారం లైబ్రరీకి వెళ్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె మరణించింది. కాగా, ఈమె తండ్రి రామానాయుడు అమెరికాలో మరో ప్రాంతంలో ఉండగా.. తల్లి కంటుభుక్త సునీత ఇక్కడే ఉన్నారు. శివాన్విత మరణ వార్త తెలియడంతో అందరూ విషాదంలో మునిగిపోయారు.

అడల్ట్ సైకాలజీపై విద్యార్థులకు అవగాహన

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు అడల్ట్ సైకాలజీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ మిస్త్రీ, ప్రతినిధులు ఆల్తాఫ్, సుబ్బలక్ష్మి విద్యార్థులకు పలు అంశాలు తెలియజేశారు. ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయుడు ఇజ్రాయెల్ రోమర్ పాల్గొన్నారు.

9న శ్రీరామ పట్టాభిషేకం

పీఎం పాలెం: స్థానిక ఆఖరి బస్టాపు సమీపంలోని శ్రీ రామాలయం వద్ద రామాయణ మహాకావ్యంలోని సుందరాకాండ పారాయణాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 9వ తేదీన శ్రీ సీతారామచంద్రస్వామి పట్టాభిషేకం జరిపిస్తామని ఆలయ కమిటీ తెలిపింది. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జరిగే కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరింది.

పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలి

తగరపువలస: ఈ నెల 9న జరుగనున్న అఖిల భారత పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని చిట్టివలస జ్యూట్‌మిల్లు పెన్షనర్ల సంఘం కోరింది. సోమవారం గుజ్జు రామునాయుడు భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ నిత్యం తనను తాను పొగుడుకోవడమే తప్ప పేదవారు రూ.1000 పెన్షన్‌తో కుటుంబాన్ని ఎలా గడుపుకోవాలో తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో దామోదర బాబాజీ, కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, చిల్ల రాంపైడి తదితరులు పాల్గొన్నారు.

- 9న సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఆనందపురంలో సిటు ర్యాలీ నిర్వహించింది. నాయకులు ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి, ఎస్.అప్పలనాయుడు, నీలాతి రాము తదితరులు పాల్గొన్నారు.

మధురవాడలో ప్రచార జాత

మధురవాడ: ఈ నెల 9న చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని నిర్వహిస్తున్న ప్రజార జాత సోమవారం మధురవాడ చేరుకుంది. దీనికి సీఐటీయూ అనుబంధ విశాఖ జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం అధ్యక్షుడు పి.రాజ్‌కుమార్, నాయకులు, కార్మికులు స్వాగతం పలికారు.

ఎన్‌సీసీకి 62 మంది ఎంపిక

- చంద్రంపాలెం హైస్కూల్లో సెలక్షన్స్
- 42మంది బాలురు
- 20 మంది బాలికలకు అవకాశం



ఆర్మీ అధికారులు, ఉపాధ్యాయులతో ఎంపికైన 2ఏ వీఎస్‌పీ యూనిట్ బాల, బాలికలు



సెలక్షన్స్‌లో బాగంగా విద్యార్థుల శారీర దారుఢ్యాన్ని పరీక్షిస్తున్న అధికారులు

మధురవాడ: విద్యార్థుల్లో దేశభక్తితో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, శారీరక దారుఢ్యం వంటివి పెంపొందించేందుకు పాఠశాల స్థాయిలోనే బాటలు వేసేది నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ). ఇందులో చేరేందుకు విద్యార్థులు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్లో రెండు ఎన్‌సీసీ యూనిట్లు ఉన్నాయి. ఇందులో 2(ఏ)బెటాలియన్ ఎన్‌సీసీ యూనిట్ సెలక్షన్స్ సోమవారం జరిగాయి. ఈ సెలక్షన్స్‌కు 150 మంది బాలికలు, 300 మంది బాలురు హాజరయ్యారు. విశాఖపట్నం 2 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ యూనిట్‌లో చేరడానికి 30 శాతం బాలికలు,70శాతం బాలురకు అవకాశం ఉంది. వీరికి రన్నింగ్, బస్కీలు, ఇతర ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో 20 మంది బాలికలు, 42 మంది బాలురు ఈ యూనిట్‌కు ఎంపికయ్యారు. ఈ సెలక్షన్స్ ఆర్మీ పీఐ స్టాఫ్ హవల్దార్లు శ్యామలరావు, మహేందర్, శుక్రరాజ్ పర్యవేక్షణలో నిర్వహించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు వెంకటరావుకు ఎన్‌సీసీ క్యాలెండర్ అందజేశారు.

పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే అవకాశం



మా పాఠశాల విద్యార్థులను ఉత్తమ పౌరుగా తీర్చిదిద్దే అవకాశం నాకు లభించినందుకు ఆనందంగా ఉంది. సమాజ సేవతో పాటు దేశభక్తి కూడా పెంపొందడానికి ఇది ఎంతో ఉపయోగ పడుతుంది. ఎన్‌సీసీ క్యాడెట్‌లు ఎప్పుడు ఏ ఆపద, అవసరం వచ్చినా సహాయానికి సిద్ధంగా ఉంటారు. అందుకే వీరికి ప్రత్యేక గుర్తింపు ఉంటుంది.

– బోని అప్పలనాయుడు, ఏఎన్‌వో, 2ఏ. బీఎన్, చంద్రంపాలెం

దేశ సేవ అంటే చాలా ఇష్టం



దేశ సేవ చేసే ఆర్మీ, నేవీలో పనిచేయడం అంటే నాకు చాలా ఇష్టం. దానికి ఇది తొలి మెట్టుగా భావిస్తున్నాను. ఇందులో సెలక్ట్ అయినందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ శిక్షణ పూర్తి చేసుకుని, కచ్చితంగా ఇలాంటి వాటిలోనే జాబ్ సంపాదిస్తాను.

–రొంగలి. లావణ్య, 9వ తరగతి ఈ సెక్షన్

ఫోర్స్‌లో చేరాలని..



ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌తో పాటు పోలీసు, బీఎస్‌ఎఫ్ వంటి వాటిల్లో పనిచేయడం అంటే నాకు చాలా ఇష్టం. అందులో చేరడానికి ఎన్‌సీసీ ఎంతో మేలు చేస్తుంది. ప్రాథమిక శిక్షణ ఇక్కడ లభిస్తుంది. పైగా కాలేజీకి వెళ్లిన తర్వాత కూడా ఇందులో చేరి, పూర్తిగా సీ సర్టిఫికెట్‌తో బయటకు వస్తాను.

–ముక్కల ప్రణీత్, 9వ తరగతి, హెచ్–సెక్షన్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పద్మనాభం: మండలంలోని రేవిడి సబ్ స్టేషన్ పరిధిలోని కోరాడ ఫీడర్ లైన్‌లో ఆర్‌డీఎస్‌ఎస్ పనులు చేపట్టనున్నందున మంగళవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ జగన్మోహనరావు తెలిపారు. కోరాడ, గెద్దపేట, సుంకరపేట, లింగన్నపేట, బొత్సపేట, బుడ్డివలస, బీఆర్ తాళ్లవలస, భీమునిపట్నం మండలం మజ్జిపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

స్థలం స్వాధీనంలో ఉద్రిక్తత

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని మామిడి పాలెం గ్రామంలో ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునేందుకు సోమవారం అధికారులు వెళ్లడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇక్కడ గెడ్డ సమీపంలో సుమారు అయిదు సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని, పక్కనే కొంత ప్రైవేటు స్థలాన్ని కొందరు ఆక్రమించి షెడ్లు నిర్మించారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు అందడంతో రెవెన్యూ అధికారి శ్రీదేవి పొల్లెయిన్, సిబ్బందితో కలసి స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు వెళ్లారు. అయితే వారు రాకుండా పలువురు అడ్డుకోవడంతో కొంత ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. రెండు రోజుల్లో పోలీసుల సహకారంతో తిరిగి వచ్చి, స్థలం స్వాధీనం చేసుకోవాలని అధికారులు నిర్ణయించి వెనుదిరిగారు.

అమ్మవారి చదురు వద్ద వైద్య శిబిరం

తగరపువలస: ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం బొగ్గురోడ్డు సచివాలయం పరిధిలోని గాంధీబొమ్మ వీధిలో అమ్మవారి చదురు వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. టీబీ వ్యాధి లక్షణాలు తెలియచేసి వారికి అందించే వసతులు గురించి వివరించారు. శిబిరంలో 128 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ చక్రవర్తి, వైద్య సిబ్బంది ప్రేమ్‌కుమార్, పద్మజారాణి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐబీడీపీ ఫలితాలలో ఓక్రిడ్జ్ విద్యార్థుల ప్రతిభ



రుత్విక్

తగరపువలస: ఇంటర్నేషనల్ బాకలోరియట్ డిప్లమో ప్రోగ్రాం–2025 ఫలితాలలో భీమిలి మండలం శింగనబంద పంచాయితీ ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారు. రుత్విక్ 45 మార్కులకు గాను 41 మార్కులు సాధించి ప్రపంచ స్థాయిలో అత్యుత్తమ ఐబీ విద్యార్థులలో ఒకరిగా నిలిచినట్లు ప్రిన్సిపాల్ భమిడిపాటి శైల తెలిపారు. ఈ ఏడాది తమ విద్యార్థుల సగటు స్కోరు 32.7గా నమోదైందన్నారు.







సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

భీమిలి

9912220753

Office mail : sakshiadvtvsp@gmail.com